క్లుప్తంగా

ఊర కుక్కల పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలో సంచరిస్తున్న ఊర కుక్కలను వల వేసి పట్టుకున్నారు. ఈ నెల 7న ‘సాక్షి’లో ‘రెచ్చిపోతున్న కుక్కలు’ పేరుతో ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. కుక్కలను పట్టే వ్యక్తుల కోసం వాకబు చేయగా బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు నుంచి వచ్చిన వ్యక్తులు 44 కుక్కలను పట్టుకొని ప్రత్యేక వాహనంలో బంధించారు. పట్టుకున్న కుక్కలను అటవీ ప్రాంతంలో వదిలివేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ తెలిపారు. గురువారం సైతం మరిన్ని కుక్కలను పట్టుకోనున్నట్లు తెలిపారు.

నేడు బీఎస్పీ రోడ్ షో

కౌటాల: మండల కేంద్రంలో గురువారం బీఎస్పీ పార్టీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రోడ్ షో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు దుర్గం వెంకటేశ్, ఉపాధ్యక్షుడు ఆనంద్ బుధవారం తెలిపారు. నేడు సాయంత్రం 4 గంటల నుంచి స్థానిక మినీ స్టేడియం నుంచి తలోడి చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం మార్కెట్ ఏరియాలో సభ నిర్వహిస్తామన్నారు. బీఎస్పీ పార్టీలో నేడు మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లెండగురె శ్యామ్‌రావు, కన్నెపల్లి ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం మోతిరాం బీఎస్పీ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

శ్యాంనాయక్‌కు చేదు అనుభవం

జైనూర్: కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ నాయకుడు అజ్మీరా శ్యాంనాయక్‌కు మండలంలోని దబోలి గ్రామ పంచాయతీ పరిధిలోని శేకుగూడలో చేదు అనుభవం ఎదురైంది. బుధవారం ప్రచారానికి వెళ్లిన శ్యాంనాయక్‌ను గ్రామస్తులు అడ్డుకున్నారు. అనంతరం బీ ఫాం వస్తేనే తమ గ్రామానికి ప్రచారానికి రావాలని తేగేసి చెప్పారు.

‘వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే’

కెరమెరి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచితీరుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు గణేశ్ రాథోడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యకర్తలతో మాట్లాడారు. ఈ ఎన్నికలు అందరికీ చాలా ముఖ్యమన్నారు. తనకు కాంగ్రెస్ టికెట్ ఖరారు కానుందని చెప్పారు. టికెట్ కోసం అధిస్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని పేర్కొన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సుదర్శన్, బాపూరావు, గిడ్డప్ప, బాబు, సత్తయ్య ఉన్నారు.

కాంగ్రెస్ టికెట్ సీనియర్లకే కేటాయించాలి



సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు

జైనూర్: కొన్నేళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న సీనియర్లకే టికెట్ కేటాయిస్తామని పార్టీ పెద్దలు ప్రకటించడంతో మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని కుమురం భీం కూడలి వద్ద టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు గణే రాథోడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. డిక్లరేషన్ కరపత్రాలను ప్రతీ గడపగడపకూ అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమలో పార్టీ నాయకులు రఫీక్, దండుగుల మహేష్, బాబు పఠాన్ ఉన్నారు.

వందరోజులు పని దినాలు కల్పించాలి

తిర్యాణి: అర్హులైన కూలీలందరికీ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద వందరోజుల పనిదినాలను కల్పించాలని జిల్లా విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన పనుల సామాజిక తనిఖీ అవసరమగు విధంగా రికార్డులు తయారు చేసి సిద్ధంగా ఉండాలన్నారు. ఎంపీడీవో సత్యనారయణసింగ్, ఎంపీవో జావిద్, ఈజీఎస్ ఏపీవో షాకిర్ ఉస్మాని ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్, దిందా, మెట్‌పల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం అధికారులు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మంచినీరు, ర్యాంపులు ఉన్నాయా లేదా అనే తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్, ఎంపీవో గౌరీశంకర్, సర్పంచ్ జంగు, ఉపసర్పంచ్ పెంటయ్య, కార్యదర్శి సంధ్య పాల్గొన్నారు.

సమస్యల్లో ‘చిన్నుగూడ’

- సమస్యలతో ఆదివాసీలు సతమతం
- ఏళ్లుగా పక్కా ఇళ్లకు నోచని వైనం
- కనిపించని బీటీ రోడ్డు
- ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీరుబంద్



ఇదే చిన్నుగూడ గ్రామం

కెరమెరి: మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని ఆదిమ గిరిజనులు(పీటీజీ) గ్రామం సమస్యలతో సతమతమవుతోంది. దీంతో కెస్లాగూడ గ్రామ పంచాయతీల్లోని చిన్నుగూడ గ్రామం చిన్నబోయింది. ఫలితంగా ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామంలో మొత్తం 18 కుటుంబాలు ఉండగా.. 85 మంది జనాభా నివాసముంటున్నారు. అనేక మందికి సాగు భూములు లేక కూలీ పనులు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

50 ఏళ్లుగా ఇదే గతి..

సుమారు 50ఏళ్ల క్రితం బస చేసిన గ్రామం అది.. ఇప్పటి వరకు ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ వారి తలరాతలు మాత్రం మారడం లేదు. 18 గృహాల్లో ఐదు గృహాలు మాత్రమే ఇటుక గొడలతో ఉన్నాయి. మిగిలిన గృహాలు కట్టె పుల్లలు, వెదురులతో నిర్మించివే. ఇంతటి అభివృద్ధి చెందిన కాలంలో ఒక్క ఇంటికి కూడా స్లాబ్ లేకపోవడం ఆశ్చర్యకరం!. కొన్ని ఇళ్లపై రేకులు ఉంటే.. మరికొన్నింటిపై గూనపెంకులు ఉన్నాయి. ఇంకొన్నింటిపై ప్లాస్టిక్ కవర్లతో కప్పబడి కనిపిస్తున్నాయి. వర్షం వస్తే వారి పరిస్థితి వర్ణనాతీతం.. నీటితో ఇల్లు గుల్లవుతోంది. గతం నుంచి ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వాలపై వారు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ఎవరూ కూడా వారిని ఆదుకోకపోవడం గమనార్హం! గృహలక్ష్మిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మరి అదైన మంజూరు అవుతుందో లేదో వేచి చూడాలి!.

రోడ్డుకు కలగని మోక్షం..!

మండల కేంద్రం నుంచి ఆ గ్రామానికి వెళ్లాలంటే కేవలం మూడు కిలో మీటర్లే. కానీ ఇంత వరకు కచ్చా రోడ్డే దిక్కు. చలి, వేసవి కాలాల్లో ఎలాగోలా నడుస్తున్నప్పటికీ వానకాలంలో వారు పడుతున్న బాధలు అంతా ఇంతా కావు. వానలు కురిసి ఆ రోడ్డంతా బురదమయమవుతోంది. అప్పుడు వారు నడక కోసం పడుతున్న బాధలు మాటల్లో చెప్పరానివి. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎన్నో గ్రామాలకు బీటీ, సీసీ రోడ్లు మంజూరు అయినప్పటికీ ఈ గ్రామంపై అధికారులు కానీ నాయకులకు కానీ కనికరం చూపడం లేదు. అలాగే గ్రామంలో ఒకటే చేతిపంపు ఉంది. అది చెడిపోతే పక్కన ఉన్న మడవి గూడకు వెళ్లాల్సిన పరిస్థితి. మిషన్ భగీరథ నీరు ఐదురోజులుగా సరఫరా కావడం లేదని స్థానికులు వాపోతున్నారు.



చిన్నుగూడకు వెళ్లేదారి దుస్థితి..



వెదురుకర్రతో తయారు చేసిన ఇల్లు

వానాకాలం చాలా ఇబ్బంది..



కచ్చా రోడుతో వానాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రేకులు సరైన విధంగా లేకపోవడం. కర్రలతో తయారు చేసిన మట్టి గొడలు ఉండడంతో అన్ని వైపుల నుంచి వర్షపు నీరు వస్తుంది. అధికారులు ఆదుకోవాలి, గృహలక్ష్మి సౌభాగ్యం కల్పించాలి.

– సిడాం అన్నిబాయి, చిన్నుగూడ

బీటీ రోడ్డు వేయాలి!



గ్రామంలో సీసీ రోడ్డు వేసినప్పటికీ.. కెరమెరికి వెళ్లే ప్రధాన రోడ్డు కచ్చాగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వానకాలంలో బురదలో నడవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. మరో చేతిపంపు ఏర్పాటు చేసి తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలి.

– సిడాం మారు, చిన్నుగూడ

సాగుతున్న కార్మికుల ఆందోళన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం బైఠాయించి అధికారులు, ఉద్యోగులను కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, డీఈ రమాదేవి, కార్యాలయం ఉద్యోగులు, ఐకేపీ ఉద్యోగులు, కార్యాలయం సిబ్బంది కార్యాలయలోకి వెళ్లేందుకు యత్నించగా తమ పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు వెళ్లనివ్వమని తేల్చి చెప్పారు. పెండింగ్ వేతనాలకు సంబంధించి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, ఉన్నతాధికారుల నుంచి మంజూరు కావాల్సి ఉందని మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. అయినప్పటికీ కార్మికులు వినిపించుకోకుండా మధ్యాహ్నం వరకు కార్యాలయ ఆవరణలోనే నిరీక్షించిన అధికారులు, సిబ్బంది కార్యాలయంలోనికి వెళ్లకుండా చూశారు. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా కార్యాలయం ఎదుటే బైఠాయించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ కార్యాలయంలోకి అధికారులను వెళ్లనిచ్చే ప్రసక్తే లేదని ఆ సంఘం నాయకులు శంకర్, సంజీవ్‌లు స్పష్టం చేశారు.

‘ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం’



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే మూడోసారి విజయమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో గురుడుపేట గ్రామంలోని పలువురికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని తెలిపారు. సిర్పూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో చింతలమానెపల్లి ఎంపీపీ నానయ్య, పార్టీ మండలాధ్యక్షులు వసంత్‌రావు, రైతు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, నాయకులు వెంకటేశ్, అశోక్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు వార్ల కిరణ్‌కుమార్ బుధవారం జెడ్పీవైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అతడికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పేదల సంక్షేమంపై బీఆర్ఎస్ అవలంభిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరినట్లు కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమాలో సిర్పూర్ (టి) మండల కోఆప్షన్ సభ్యులు కిజర్, నాయకులు పుల్ల శ్రీకాంత్, ఉమాకాంత్, నాని, తాజ్ పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: డిజిటల్ చెల్లింపుల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఏడీఈ శ్రీనివాస్, అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి తుకారాం కోరారు. బుధవారం పట్టణంలో విద్యుత్ కార్యాలయంలో వినియోగదారులకు డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఫోన్‌పే, గూగల్, పేటీఎం, బిల్‌డెస్క్, అమెజాన్, టీవ్యాలెట్ ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చన్నారు. ఏఈ కమలాకర్, ఫోర్‌మెన్ భూమయ్య, ఎస్ఎల్ఐ మురళీధర్ ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పల్లకీ ఊరేగింపులో భక్తులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ శ్రీవేంకటేశ్వర ఆలయంలో దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సిర్పూర్(టి) మండల హిందూ ఉత్సవ సమితి, శ్రీ బాలాజీ వెంకటేశ్వర ఆలయ కమిటీల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజు ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు భక్తుల సౌకర్యార్థం మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం భజన కార్యక్రమం, రాత్రి స్వామివారి పల్లకి ఊరేగింపు నిర్వహిస్తున్నారు. రాత్రి స్వామివారి పల్లకి ఊరేగింపులో వందలాది మందిభక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో భజన పాటలతో స్థానిక శ్రీ బాలాజీ వెంకటేశ్వర ఆలయం నుంచి డౌనల్, శివాజీ నగర్, రజక కాలనీ, కంసలివాడ తదితర కాలనీల్లో స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లగా ఆయా కాలనీల భక్తులు మహిళలు హారతులు ఇచ్చి స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

దేశం గొప్పతనం తెలియజెప్పాలి

ఆసిఫాబాద్‌రూరల్: భారత దేశం గొప్పతనాన్ని తెలియపర్చాలని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సేవా ప్రముఖ్ శివ శంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిబిరం నిర్వహించారు. విభాగ్ సహకార్యవర్గం సభ్యులు భూమయ్య, మధుకర్ ఉన్నారు.

పంటలకు చీరల రక్ష



మడావిగూడ వద్ద పత్తి చేనుకు కట్టిన చీర



చిన్నుగూడ వద్ద పొలానికి..

కెరమెరి: మండలంలోని పత్తి పంటలతో పాటు కందులు, ఇతర పంటల రక్షణకు చీరలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం మండలంలోని ఏ పొలాన్ని చూసినా చుట్టూ చీరెల కట్టి ఉన్న దృష్యాలే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పందులు, కోతుల బెడద అధికంగా ఉన్న నేపథ్యంలో రైతులు ఇలా చీరల ద్వారా పంటలకు రక్షణ కల్పిస్తున్నట్లు చెబుతున్నారు.

కళాశాలల్లో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలతో విద్యార్థినులు

కౌటాల: మండల కేంద్రంలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. అనంతరం ప్రిన్సిపాల్ సంగ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ సంప్రదాయనికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినిలు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపకులు పాల్గొన్నారు.

వాంకిడిలోని కళాశాలలో..

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి కళాశాల ప్రాంగణంలో సంబురాలు జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోతతో దిగుబడి అంచనా



పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

కౌటాల: పంట కోత ప్రయోగంతో పంట దిగుబడి అంచనా వేస్తామని మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్ అన్నారు. మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామ శివారులో బుధవారం సోయాబీన్ పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల్లో కారణంగా సోయా పంటలో దిగుబడి తగ్గిందని తెలిపారు. గతంలో ఎకరంలో పది క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది ఎకరం చేనులో 5క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. పత్తి, వరి, మిర్చి పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మొగడ్‌దగడ్ గ్రామంలో పీఎం కిసాన్ సమాన్ నిధిలో ఈ కేవైసీ బయోమెట్రిక్ నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఓలు చౌదరి అంజన్న, కల్పన, రైతులున్నారు.

‘ఆదరించండి అభివృద్ధి చేస్తా’



వంకులంలో మాట్లాడుతున్న కోవలక్ష్మి

రెబ్బెన: వచ్చే నెలలో నిర్వహించే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని రాంపూర్, నవేగాం, వంకులం, రాళ్లపేట గ్రామాల్లో ప్రజలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాను సాధించుకోవటంతో పాటు 350 పడకల ఆసుపత్రి కేసీఆర్ చలువతో ఆసిఫాబాద్‌లో ఏర్పాటు చేసుకున్నామన్నారు. గ్రామాల్లోనూ కోట్లాది రూపాయల సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. కేసీఆర్ అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అలాగే వంకులం గ్రామంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్ ఉన్నారు.

సోయా.. దిగుబడి దిగాలు

- తగ్గిన సోయా పంట దిగుబడి
- చిన్నసైజులో గింజలు
- వాతావరణ మార్పో, నకిలీ విత్తనమో తెలియని దుస్థితి
- కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు
- పెట్టుబడి కూడా రాదని రైతుల ఆవేదన



పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

కౌటాల: రైతుల ఆశలపై సోయా పంట నీళ్లు చల్లింది. వాతావరణంలో మార్పులు ఓ వైపు, శుద్ధి లేని విత్తనాలు ఓ వైపు. ఈ సంవత్సరం కోటి ఆశలతో, ఎన్నో వ్యయ ప్రయాసాల మధ్య సోయా పంటలను జిల్లా రైతులు పండించారు. ఈ సంవత్సరం సోయా పంట దిగుబడి పూర్తిగా పడిపోవడంతో రైతు కంట కన్నీరే మిగిలింది. ఒకప్పుడు ఎకరానికి కనీసం పది క్వింటాళ్లకు తగ్గకుండా పంటలు తీసిన రైతులు నేడు ఎకరానికి ఐదు క్వింటాళ్లు మించిరాని పంటను చూసి విస్తుపోతున్నారు. అప్పులు చేసి పంటలు వేసిన చిన్న, సన్నకారు రైతులకు పంట దిగుబడి రాక వచ్చిన పంట వడ్డీలకు సైతం సరిపోని పరిస్థితి. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని సోయా రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏటా నష్టాలే

ఎండనకా వాననక ఆరుగాలం కష్టపడే రైతులకు పంటల సాగులో ఆశించిన దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో 15 ఏళ్లుగా సోయా పంటను సాగు చేస్తున్నారు. రైతు కూలీలు అవసరం లేకుండా తక్కువ సమయంలోనే ఒకేసారి పంటచేతికి రావడంతో రైతులు సోయాను సాగు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా జిల్లా రైతులు 1524 సోయాను సాగు చేశారు. గతేడాది 9,186 ఎకరాల్లో సాగు చేయగా గతేడాది పంట దిగుబడి రాకపోవడంతో పాటు పత్తికి ధర పెరగడంతో ఈ సారి పత్తి పంటను ఎక్కువగా సాగు చేశారు. దీంతో గతేడాది కంటే ఈసారి 7,662 ఎకరాల్లో సోయా పంట సాగు తగ్గింది. వాతావరణాల్లో మార్పులు.. నాసిరకం విత్తనాలతో సోయా రైతులు ఏటా నష్టపోతున్నారు. విత్తనం వేశాక గడ్డి మందు ఒకసారి కొట్టి కాత, పూత దశలో మరోసారి తెగుళ్ల రాకుండా పిచికారీ చేసేవారు. ఈయేడు రైతులు మూడు నుంచి నాలుగుసార్లు పిచికారీ చేశారు. దీంతో పెట్టుబడి పెరిగింది. ఒక్కో ఎకరానికి విత్తనం నుంచి పంటకోసే వరకు రూ.23వేల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ సోయాకు రూ. 4,200 నుంచి రూ. 4,400 పలుకుతోంది. ప్రభుత్వం ఈయేడు సోయా పంటకు క్వింటాలుకు రూ.4,600 మద్దతు ధర ప్రకటించింది. దిగుబడి తగ్గడంతో రైతులకు పెట్టుబడి డబ్బులు కూడా చేతికి రావడం లేదు.

తగ్గిన పంట దిగుబడి

జిల్లాలోని రైతులు సోయాబీన్ పంటను సాగు చేయడానికి అంతగా ఆసక్తి చూపించడం లేదు. గతంలో సోయా పంటను వేల ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో గతంలో సోయా పంట ప్రధాన పంటగా సాగైది. కానీ సోయా పంటకు మద్దతు ధర తక్కువగా ఉండడంతో రైతులు సోయా పంటను ఎక్కువగా సాగు చేయడం లేదు. నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన సోయా పంట రైతులను ఏటా నట్టేట ముంచుతోంది. ఈ సారి రైతులు అధిక ధరలు చెల్లించి విత్తనాలు కొనుగోలు చేసి కోటి ఆశలతో సాగు చేసిన సోయా పంట చివరకు రైతులకు నిరాశే మిగిల్చింది. పంట దిగుబడి పడిపోవడంతో రైతులు తీవ్ర నిరాశలకు గురవుతున్నారు. ఒక్కో ఎకరానికి కేవలం ఐదు క్వింటాళ్ల సోయా మాత్రమే దిగుబడి వస్తుంది. కొన్ని చోట్ల ఎకరానికి మూడు నుంచి నాలుగు ఎకరాలు మాత్రమే దిగుబడి వస్తోంది. గతంలో ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు సోయా పంట దిగుబడి వచ్చేది. ఈ సారి పంటకు అనుకూలంగా వర్షాలు కురిసిన పంట దిగుబడి తగ్గింది.

ఆందోళనలో రైతులు

జిల్లాలో సోయా పంట కోతలు చేపడుతున్నారు. పంట అమ్మకానికి కొనుగోలు కేంద్రాలు లేక ప్రైవేట్ వ్యాపారులు, దళారులకు తక్కువ ధరకే పంటను విక్రయిస్తున్నారు. పంట నాసిరకంగా ఉందని వ్యాపారులు సోయాకు మద్దతు ధర పెట్టడం లేదని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్, ప్రైవేట్ వ్యాపారుల నుంచి అప్పులు చేసి వేసిన సోయా పంట అధిక దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోయా పంటకు మద్దతు ధర కల్పించాలని సోయా రైతాంగం కోరుతున్నారు.

మద్దతు ధర పెంచాలి

మూడు ఎకరాల్లో సోయా పంట వేశాను. ఇంతకు ముందు సోయా పంట ఎక్కువ దిగుబడి వచ్చేంది. ప్రస్తుతం అటు నాసిరం విత్తనాలు ఇటు వాతావరణ మార్పులతో ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రావడం లేదు. ఎకరాకు ఐదు క్వింటాళ్లకు మించి పంట దిగుబడి రాలేదు. చేతులో డబ్బు లేక ఈ సంవత్సరం అప్పులు చేసి పంట సాగు చేశాను. ప్రభుత్వం సోయాకు రూ. 10 వేలు మద్దతు ధర కల్పించాలి. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– దామోదర్, బోదంపల్లి

దుర్గాదేవికి పూజలు

కెరమెరి: దుర్గాదేవికి భక్తులు ప్రతి రోజు ప్రత్యేక పూజలు జరుపుకుంటున్నారు. చిన్నా పెద్దా అనే తారతమ్యం లేకుండా ఉదయం, సాయంత్రం అమ్మవారి ప్రతిమల వద్ద మహిళలు ప్రత్యేక గీతాలాపన చేస్తున్నారు. నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు. వివిధ రకాల పాటలపై నృత్యాలు చేస్తున్నారు.